# ఆటోవాలా

**-డి.కె.ఎల్.వి.ప్రసాద్**



శ్రీనివాసమూర్తి ఆఫీసులో అడుగుపెట్టినప్పటినుంచి చాలా హేపీగా కన్పిస్తున్నాడు. పట్టుమని పది నిమిషాలు కూడా తన సీట్లో కూర్చోకుండా, కాలుగాలిన పిల్లిలా అటు ఇటు, తిరుగుతున్నాడు.

నిజానికి శ్రీనివాసమూర్తి ఆఫీసుకు ఎప్పుడూ పదకొండు గంటలు దాటిన తరువాత గాని రాడు. కాని, ఆరోజు మాత్రం ఉదయం తొమ్మిది గంటలకే ఆఫీసుకు చేరుకున్నాడు. హుషారుగా సినిమా పాటలు హమ్మింగ్ చేసుకుంటూ ఫైళ్ళన్నీ టేబుల్ మీద పేర్చి, తనకు కావలిసిన ముఖ్యమైన కాగితాలన్నీ ఒక చోట పెట్టుకుంటున్నాడు. అత్యవసరమైన ఫైళ్ళను అటెండరు సాయిలు సహాయంతో జిరాక్సు తీయించుకుంటున్నాడు.

మధ్య మధ్యలో ప్రక్క సెక్షన్లకు పోయి, ఎంత స్పీడుగా వెళ్ళాడో అంతే స్పీడుగా తిరిగి వస్తున్నాడు. ఆరోజు శ్రీనివాసమూర్తి పనితీరు చూసిన వారికి, ప్రభుత్వ ఆఫీసుల్లో ఎంత క్రమశిక్షణగా పని జరుగుతున్నదోనన్న అభిప్రాయం కలగక మానదు.

శ్రీనివాసమూర్తి హడావిడి చూసిన చూచిన వాళ్ళకి ఆరోజు ఎవరైనా పై అధికారులో లేక ఏదైనా ఆడిటి పార్టీ వంటివో వస్తున్నాయనుకుంటారు. ఒక వేళ అలా అనుకుంటే పప్పులో కాలేసినట్లే! అదే నిజమయితే ఆ సమయానికి ఆఫీసులో వాళ్ళ అందరూ రావాలి కదా!

మూర్తి పని హడావిడిలోని రహస్యం ఆఫీసు అటెండర్ సాయిలుకు మాత్రమే తెలుసు. అందుకే యిలాంటి అత్యవసర పనులకి, సాయిలును ఉపయోగించుకుంటాడు శ్రీనివాసమూర్తి.

ఆఫీసులో శ్రీనివాసమూర్తికి చాలా ముఖ్యమైన సీటు. అంతా బడా-బడా కాంట్రాక్టర్లతోను, వాళ్ళ ద్వారా పెద్ద పెద్ద అధికారులతోను సంబంధాలు ఏర్పాటు చేసే శక్తి మంతమైన సీటు. పలుకుబడి వున్న సీనియర్లు, ఆ సీటును చేజిక్కుంచుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తుంటారు.

శ్రీనివాసమూర్తి కూడ ఆవిధంగానే ఆ సీటును దక్కించుకున్నాడు.

ఆ సీటుకు అంతడిమాండ్ వుండడానికి గలకారణం? దానికి టెండర్లతోను, కాంట్రాక్టర్లతోను, తద్వారా వారి బిల్లులతోను సంబంధాన్ని కలిగి వుండడమే! ఇప్పుడు శ్రీనివాసమూర్తి హడావిడికి కూడా యిదే ముఖ్యకారణం! ఆరోజు ఎ-క్లాస్, కాంట్రాక్టర్ శ్రీశివానందరెడ్డి పుణ్యామా అని, అధమపక్షంగా ఎంత కాదనుకున్నా అతని జేబులుకి, పది-పదిహేను వేలు చేరే అవకాశం వుంది.

అందుచేతనే, సంతకాలు చేయవలసిన అఫీసరు వచ్చేలోగా అవసరమయిన వన్నీ సిద్ధం చేస్తున్నాడు శ్రీనివాసమూర్తి.

''అయ్యగారు పిలుస్తున్నారు సార్....''

అని, సాయిలు పిలిచే సరికి, ఊహాలోకంలో నుంచి బయటపడి, ఫైళ్ళు తీసుకుని ఆఫీసర్ ఛాంబర్ వైపు నడిచాడు శ్రీనివాసమూర్తి.

మరో అరగంట గడిచిన తర్వాత ''రాజు వెడలె...'' అన్న స్టైల్లో కాంట్రాక్టర్ శివానందరెడ్డి కూడా అదే ఛాంబర్‌లోనికి ప్రవేశించాడు. రెండు గంటల తర్వాత వికసించిన పుష్పంలా ముఖం నిండి నవ్వులు పులుముకుని బయటికి వచ్చాడు శ్రీనివాసమూర్తి.

శ్రీనివాసమూర్తి ఆరోజంతా సంతోషమూర్తి అయినాడు.

మధ్యాహ్నం తన ముద్దుల భార్య సుమతికి ఫోన్ చేసి, సెకండ్ షో సినిమాకు వెళ్ళడానికి సిద్ధం గావుండమన్నాడు. తన ప్రాణ స్నేహితులు బాలరాజు, సయ్యర్‌లను సరిగ్గా సాయంత్రం ఆరుగంటలకల్లా 'దిగ్విజయ్ - బార్'కు రమ్మని తన మొబైల్ ఫోన్ నుంచి సమాచారం పంపించాడు. అతనిని పరిక్షించి చూస్తే అంచనాలకు మించిన సొమ్మే అతనికి గిట్టుబాటు అయినట్లు కన్పిస్తోంది.

***

తన బైక్ బావమరిది సురేందర్ తీసుకెళ్ళడంతో శ్రీనివాసమూర్తి, భార్య సుమతిని తీసుకుని ఆటోలో సెకండ్ షో సినిమా కెళ్ళారు. సినిమా చక్కని కథతో, సంగీత ప్రధానమైన సూపర్‌హిట్ అయినపుటికి, కడుపులోని కదలికలు, మూర్తిని సినిమా ఎంజాయ్ చేయనివ్వడం లేదు. కేవలం శ్రీమతి సుమతికోసం బలవంతంగా సీట్లో కూలబడిపోయి వున్నాడు శ్రీనివాసమూర్తి.

సినిమా వదిలాకా, భార్య భర్తలిద్దరూ బయటికి వచ్చి, ఆటో కోసం వెదకడం మొదలు పెట్టారు. తమకోసమే నన్నట్లుగా ఒక ఆటో ఆ యిద్దరి ముందుకు వచ్చి ఆగింది.

ఆటో డ్రైవర్ వినయంగా ఆటోదిగి, ఆ జంటను ఆటో ఎక్కవలసిందిగా ఆహ్వానించాడు. తమను చేర్చవలసిన ప్రదేశం గురించి చెప్పకుండానే ఆటోలో కూలబడ్డాడు శ్రీనివాసమూర్తి. ఇది గ్రహించిన సుమతి కలగచేసుకుని ''వింబోలి అడ్డ చౌరస్తా, ఎడం వైపు గల్లీలోనికి పోవాలి'' అంది తను కూడా మూర్తి ప్రక్కన కూర్చుంటూ.

'నాకు తెలుసు...'' అన్నట్లుగా సైగా జేసి, ఆటో స్టార్ట్ చేశాడు ఆటోవాలా.

కరెక్ట్‌గా తమ ఇంటి ముందే ఆటో ఆగడంతో భార్య భర్త లిద్దరూ అశ్చర్యానికి లోనయ్యారు. ఆటో దిగిన ఆ దంపతులకి ఎదురుగా నవ్వుతూ నిలబడ్డాడు ఆటోవాలా. అతనిని చూచిన శ్రీనివాసమూర్తికి, వంట్లోని మత్తంతా దిగిపోయి పిచ్చిపట్టినంత పనయింది. అతను ఎవరోకాదు, అఫీసులో పని చేసే మూర్తి జూనియర్ బావాసింగ్!

ఆశ్చర్యంలోనుంచి తేరుకున్న తరువాత-

''సింగ్ ఏమిటిది? ఈ వేషం ఏమిటి?'' అన్నాడు అతని భుజం మీద ఆత్మీయంగా చేయివేసి.

''ఏముందన్నా, నన్ను యీ వేషంలో చూడ్డం నీకు కొత్తగాని, గత రెండు సంవత్సరాలుగా నేను ఆటో నడుపుతున్నా''

''అదే, ఇదంతా ఎందుకంటున్నాను'' అన్నాడు శ్రీనివాసమూర్తి.

''నీకు నాగురించి తెలియనిదేముందన్నా! నాకొచ్చే ఆ జీతం నాకు, నాకుటుంబ అవసరాలకు సరిపోవడం లేదు. ఇలాంటి పరిస్థితిలో మరి ఏం చేయాలి చెప్పు? అందుకే రాత్రి 9 గంటలు దాటిన తరువాత యిలా ఆటో నడపడం ద్వారా కొంత సంపాదించగలుగుతున్నాను. ఇది నాకు ఎంతో తృప్తినిస్తుంది. మనం చేస్తున్న పని తప్పు కానప్పుడు ఈ రకంగా కష్టపడడానికి ఎందుకు సిగ్గుపడాలి?

ఆఫీసులో ఆలంచాల పాపం కూడు నాకు అరగదని నీకు తెలుసుకదా అన్నాడు. ఆకలయితే, అడుక్కని తినడానికైనా సిద్దమేగాని, ఆ పాప పంకిలంలో అడుగుపెట్టడం అంటే నాకు అసహ్యం అన్నా! అందుకే ఇది ఎంచుకున్నాను అని వాళ్ళ దగ్గర డబ్బులు కూడా తీసుకోకుండా, ఆటో స్టార్ట్ చేసి మెయిన్‌రోడ్డు వైపు సాగిపోయాడు బావాసింగ్ ఉరఫ్ ఆటో వాలా!

భర్తవంక అసహ్యంగా పురుగును చూసినట్లు చూసింది సుమతి. సిగ్గుతో తలదించుకుని తాళం తీసి ఇంట్లోకి అడుగు పెట్టడు శ్రీనివాసమూర్తి.

అతనిలోని ప్రతిగుండె చప్పుడు ఆటోవాలనే గుర్తు చేస్తోంది.

❑